www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 9 నవంబర్ 2024

5

ఏలూరు

శని, ఆదివారాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బిఎల్ఒలు

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఫొటో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9, 10, 23, 24 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారులు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు తెలిపారు. అర్హులైన వారు ఎవరైనా సరే 6, 7, 8 దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి ఇస్తే వాటిని తీసుకోవాలన్నారు. ఓటర్ల నమోదు అధికారులు, తహశీల్దార్లు కూడా వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి సజావుగా శిబిరం నడుస్తుందో లేదో పరిశీలించాలన్నారు. తహశీల్దార్లు అందరూ బిఎల్ఒలు స్వీకరించిన ఫారం 6, 7, 8 దరఖాస్తుల నివేదికను శనివారం సాయంత్రం ఐదు గంటలకు పంపాలన్నారు.

జెడ్పి ఛైర్‌పర్సన్‌పై తిరుగుబాటు..!

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసిలు

31 మంది వైసిపి జెడ్‌పిటిసిల సమావేశం

పార్టీ ఫిరాయింపుల్లో భాగంగా

అనర్హత వేటుకు పట్టు

11న జెడ్‌పి అత్యవసర సమావేశానికి ఏర్పాట్లు

జెడ్‌పి స్టాండింగ్ కమిటీ సమావేశాల బహిష్కరణ

రోజంతా జెడ్‌పిలో హైడ్రామా, అధికారుల నిరీక్షణ

కోరం లేకపోవడంతో స్టాండింగ్ కమిటీ సమావేశాలు వాయిదా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ ఛైర్మన్ గంటా పద్మశ్రీపై, అదే పార్టీకి చెందిన వైసిపి జెడ్‌పిటిసిలు తిరుగుబాటుకు దిగారు. వైసిపి తరపున గెలిచి పార్టీ ఫిరాయించిన జెడ్‌పి ఛైర్మన్‌పై పంచాయతీరాజ్ చట్టప్రకారం అనర్హత వేటు వేయాలని 31 మంది జెడ్‌పిటిసిలు సమావేశమై డిమాండ్ చేసిన పరిస్థితి నెలకొంది. శుక్రవారం జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాల నిర్వహణకు జెడ్‌పి సిఇఒ ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా పరిషత్ ఏడు స్టాండింగ్ కమిటీ సమావేశాలకు సంబంధించి కచ్చితమైన సమయం నిర్ధారించి ప్రకటించారు. దీంతో ఉదయం పది గంటలకే జిల్లా అధికారులు, జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ జెడ్‌పికి చేరుకున్నారు. ఏలూరు వచ్చిన జెడ్‌పిటిసి సభ్యులు మాత్రం జిల్లా పరిషత్‌కు మాత్రం రాలేదు. 31 మంది జెడ్‌పిటిసిలు స్థానిక వైసిపి కార్యాలయంలో సమావేశం నిర్వహించుకున్నారు. ఈ సమావేశానికి వైసిపి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ఇన్‌ఛార్జులు దూలం నాగేశ్వరరావు, ముదునూరి ప్రసాద్‌రాజుతోపాటు, ఏలూరు జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులంతా హాజరయ్యారు. సమావేశం అనంతరం జెడ్‌పిటిసిలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీని పార్టీ ఫిరాయింపుల చట్టం కింద పదవికి అనర్హురాలిగా ప్రకటించాలని కోరారు. వైసిపి గుర్తుపై గెలిచి పద్మశ్రీ జెడ్‌పి ఛైర్‌పర్సన్ అయ్యారని తెలిపారు. పంచాయతీరాజ్‌చట్టం 194 (1) ప్రొవిజన్ ప్రకారం పార్టీ విప్‌ని ధిక్కరించి వేరే పార్టీలో చేరారని, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసిపికి 46 మంది జెడ్‌పిటిసి సభ్యులుండగా గంటా పద్మశ్రీ పార్టీ మారారు. కవురు శ్రీనివాస్ రాజీనామాతో యలమంచిలి స్థానం ఖాళీగా ఉంది. ఇంకా వైసిపికి 44 మంది సభ్యులుండగా శుక్రవారం జరిగిన సమావేశానికి 31 మంది మాత్రమే హాజరయ్యారు. ఇంకా 13 మంది జెడ్‌పిటిసి సభ్యులు సమావేశానికి హాజరు కాలేదు.

11న జెడ్‌పి అత్యవసర సమావేశం

జెడ్‌పి ఛైర్‌పర్సన్ వ్యవహారంపై తాడోపేడో తేల్చుకునేందుకు జెడ్‌పి అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని వైసిపి జెడ్‌పిటిసిలు సెప్టెంబర్ 28నే జెడ్‌పి సిఇఒకు వినతి ఇచ్చారు. తర్వాత కలెక్టర్‌ను సైతం కలిశారు. అయితే అప్పుడు అధికారులు స్పందించలేదు. ఈ నెల 11న అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు జిల్లా పరిషత్ అధికారులు తెలిపారు. అంతకు ముందుగానే స్టాండింగ్ కమిటీ సమావేశాలు పూర్తి చేయాలని నిర్ణయించారు. దీన్ని వైసిపి జెడ్‌పిటిసిలు వ్యతిరేకించడంతో కోరం లేక స్టాండింగ్ సమావేశాలు వాయిదా పడ్డాయి. అత్యవసర సమావేశంలో ఏం జరుగుతుందోననే చర్చ సర్వత్రా సాగుతోంది. 2021లో జిల్లా పరిషత్ ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని మొత్తం 48 జెడ్‌పిటిసి స్థానాలకుగాను 46 చోట్ల వైసిపి గెలిచింది. ఆచంట, వీరవాసరంలో టిడిపి, జనసేన గెలిచాయి. దీంతో జెడ్‌పి ఛైర్మన్ పదవి బిసి సామాజిక తరగతికి రిజర్వు చేయడంతో యలమంచిలి జెడ్‌పిటిసిగా గెలిచిన కవురు శ్రీనివాస్ జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. 2021 సెప్టెంబర్ 16న కవురు ప్రమాణ స్వీకారం చేశారు. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కవురు శ్రీనివాస్ స్థానిక సంస్థల ఎంఎల్‌సి అభ్యర్థిగా బరిలోకి దిగి గెలుపొందారు. దీంతో జెడ్‌పి ఛైర్మన్ పీఠం ఖాళీ అయ్యింది. బిసి సామాజిక తరగతికి చెందిన పెదపాడు జెడ్‌పిటిసి గంటా పద్మశ్రీని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా వైసిపి ఎంపిక చేసింది. 2023 జూన్ ఎనిమిదో తేదీన జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది మేలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి కూటమి అఖండ విజయం సాధించింది. దీంతో జిల్లాలో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోయాయి. రెండు నెలల క్రితం గంటా పద్మశ్రీ, ఆమె భర్త ప్రసాద్ టిడిపిలో చేరారు. దీంతో వైసిపి ఎంఎల్ఎలు ఎదురుతిరిగారు. పార్టీ ఫిరాయింపుల్లో భాగంగా పద్మశ్రీపై అనర్హత వేటు వేయాలని కోరుతున్నారు. స్థానిక సంస్థల నిబంధనల ప్రకారం నాలుగేళ్ల వరకూ అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు వీలులేదు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ పదవి నుంచి ఆమెను అనర్హురాలిగా ప్రకటించాలన్నా పెద్ద ప్రక్రియ ఉంది. 11న జరిగే అత్యవసర సమావేశంలో ఎటువంటి తీర్మానం చేస్తారో చూడాలి. అధికార పార్టీలోకి చేరడంతో జెడ్‌పి ఛైర్‌పర్సన్‌కు ఎటువంటి ఇబ్బందీ ఉండదనే చర్చ నడుస్తోంది. ఏం జరుగుతుందో వేచిచూడాలి.

కోరం లేక స్థాయి సంఘాల సమావేశాలు వాయిదా

జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

స్థాయి సంఘాల సమావేశాలకు జెడ్‌పిటిసి సభ్యులు హాజరు కాకపోవడంతో కోరం లేక వాయిదా వేస్తున్నట్లు జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీతోపాటు, జెడ్‌పి సిఇఒ సుబ్బారావు తెలిపారు. 11న అత్యవసర జెడ్‌పి సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు సిఇఒ చెప్పారు.

వంకా, కవురుపై జెడ్‌పిటిసిల ఆగ్రహం..

వైసిపి కార్యాలయంలో సమావేశమైన ఆ పార్టీ జెడ్‌పిటిసిలంతా స్థానిక సంస్థల ఎంఎల్‌సిలుగా గెలుపొందిన వంకా రవీంద్ర, కవురు శ్రీనివాస్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. జెడ్‌పిటిసిల ఓట్లతో గెలిచి ఎంఎల్‌సిలు అయిన ఈ నాయకులు జిల్లా పరిషత్‌లో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడినా స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించినట్లు తెలిసింది. పదవులు అనుభవించిన నాయకులు జెడ్‌పిటిసి సమస్యలను గాలికొదిలేశారంటూ మండిపడినట్లు సమాచారం. వైసిపి హాయాంలో కవురు శ్రీనివాస్‌కు అత్యంత ప్రాధాన్యత ఉండేది. డిసిసిబి ఛైర్మన్‌గా, జెడ్‌పి ఛైర్మన్‌గా, ఎంఎల్‌సిగా మూడు పదవులను ఆయనకు వైసిపి కట్టబెట్టింది. వంకా రవీంద్రకు ఎంఎల్‌సి ఇచ్చి గెలిపించుకున్న పరిస్థితి ఉంది. ఈ నాయకులు ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదని జెడ్‌పిటిసిల సమావేశంలో చర్చకు వచ్చినట్లు సమాచారం.

సమస్యలు పరిష్కరించాలని..
14న తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు
ప్రజాపోరు యాత్రల ప్రారంభంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెంలో..

నిడమర్రులో..

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 14న తహశీల్దార్ కార్యాలయాల వద్ద చేపట్టే ధర్నాల్లో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని వంకవారిగూడెంలో ప్రజాపోరు యాత్ర ప్రారంభం సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 14 వరకు ఆయా గ్రామాల్లో ప్రజాపోరు యాత్రలు చేపడుతున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నాయని విమర్శించారు. ధరలు విపరీతంగా పెంచేశారని, నిరుద్యోగం పెరిగిపోయిందని అన్నారు. పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాస కాలనీల్లో అభివృద్ధికి నిధుల కేటాయింపులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయని, తాజాగా పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టు ఎత్తు తగ్గించేలా కుట్రలు చేస్తుందని విమర్శించారు. మండలంలోని వంకవారిగూడెం పంచాయతీ పరిధిలో నేవీ యుద్ధ సామగ్రి డిపోను ఏర్పాటు చేసి గిరిజనులను ఏజెన్సీ నుంచి తరిమేయాలని చూస్తుందన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా బిజెపి, దాని మద్దతు పార్టీలు మతం పేరుతో లౌకికవాదాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు. ప్రజా సమస్యలపై సిపిఎం నిరంతరం పోరాడుతుందని, దీనిలో భాగంగానే ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకూ ప్రజాపోరు ప్రచార యాత్రలు నిర్వహించి 14న తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, నాయకులు సిహెచ్.కొండలరావు, సిరిబత్తుల సీతారామయ్య, గంగులు, అప్పారావు, వెంకటేశ్వరరావు, మల్లు దొర పాల్గొన్నారు.

ముసునూరు: ప్రజాపోరు యాత్ర పోస్టర్లను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న తహశీల్దార్, మున్సిపల్ కార్యాలయాల వద్ద నిర్వహించే ధర్నాల్లో అంతా పాల్గొనాలని కోరారు. రోడ్లపై గుంతలను వెంటనే పూడ్చాలని, నకిలీ మొక్కజొన్న విత్తనాలను నిర్మూలించేలా చట్టం తీసుకొచ్చి రైతుకు న్యాయం చేయాలని కోరారు. గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొడవలి శ్రీనివాసరావు, కంచర్ల దుర్గారావు, రమేష్, శివప్రసాద్, సత్యనారాయణ, కంచర్ల పోతురాజు, శ్రీను, నారాయణ, రంగారావు, మురళీ, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రు: సిపిఎం ఆధ్వర్యంలో సిపిఎం ఆధ్వర్యాన ప్రజాపోరు యాత్రను ఆ పార్టీ మండల కన్వీనర్ నారపల్లి రమణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే ఆపాలన్నారు. కార్యక్రమంలో కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన, కానూరు రాజు పాల్గొని మాట్లాడారు.

మాతాశిశు మరణాలు నివారించాలి

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు

జిజిహెచ్‌లో నవజాత శిశువుల ఐసియుకు ప్రతిపాదనలు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో మాతాశిశుమరణాలు నివారించేలా ప్రతి దశలోనూ వైద్యఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో లింగ నిర్ధారణ నిషేధ చట్టం-1994 అమలుపై జిల్లాస్థాయి మల్టీమెంబర్ అప్రొప్రియేట్ అథారిటీ సలహా కమిటీ, జిల్లా ఎండిఎస్ఆర్, సిడిఎస్ఆర్ జిల్లాస్థాయి సమీక్షా సమావేశం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ మాతాశిశు మరణాలను గణనీయంగా నియంత్రించేందుకు అవలంబించాల్సిన వ్యూహాలపై అనుభవజ్ఞులైన వైద్యులతో సంబంధిత వైద్యులకు ఓరియంటేషన్ నిర్వహించాలని డిఎంహెచ్ఒ, డిసిహెచ్ఎస్‌లను ఆదేశించారు. గత మూడేళ్లలో సంభవించిన మాతా శిశు మరణాలకు సంబంధించి కేస్‌స్టడీ, ఏరకమైన వైద్యం అందిస్తే మరణాలను తగ్గించగలిగే అంశాలను విశ్లేషించాలన్నారు. తల్లి వయస్సు తక్కువ, ఇతర కారణాలతో ఆకస్మిక గర్భస్రావాలకు అవకాశం ఉన్న ప్రమాదకారకాలను గుర్తించి అందుకు అవసరమైన నియంత్రణ చర్యలు తీసుకోవాలన్నారు. హైరిస్క్ కేసుల విషయంలో ప్రసవ సమయంలో సంబంధిత వ్యక్తికి సంబంధించిన బ్లడ్ గ్రూపుతో కూడిన రక్తాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. రక్తహీనత తదితర లోపాలతో హైరిస్క్ గర్భిణులు, ప్రసవం పూర్తయ్యే వరకు ఆయా సిడిపిఒల ఆధ్వర్యంలో అంగన్వాడీ, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తల పర్యవేక్షణ అత్యంత అవసరమన్నారు. ఈ విషయంలో వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. జిజిహెచ్‌లో నవజాత శిశువుల ఐసియు ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలతో ప్రతిపాదనలు నివేదించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, అటువంటి పరీక్షలు చేసిన వారితోపాటు చేయించుకున్న వారిపైనా చట్టపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. గర్భస్థ శిశువును కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్ రెన్యువల్, డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలను ఎన్‌జిఒల ప్రతినిధుల సమన్వయంతో సంబంధిత అధికారులు ముమ్మరం చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు. స్కానింగ్ ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించేలా పర్యవేక్షించాలన్నారు. డివిజన్‌స్థాయితోపాటు మండల స్థాయిలో వేసిన కమిటీలు గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై సమావేశాలు నిర్వహించాలన్నారు. వైద్యులు ఇచ్చిన మందుల చీటీ ప్రకారమే మెడికల్ షాపుల్లో సంబంధిత మందులు విక్రయించాలన్నారు. ఈ సందర్భంగా గత కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో ఎఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ఠ, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్, ఐసిడిఎస్ పీడీ కె.పద్మావతి, డిఇఒ వెంకటలక్ష్మీ, డిసిపిఒ డాక్టర్ సూర్యచక్రవేణి, జిజిహెచ్ ఆర్ఎంఒ సిహెచ్.శ్రీనివాసరావు, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్, పలువురు వైద్యులు, ఎన్‌జిఒలు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపుపై కాంగ్రెస్ నిరసన

కాంగ్రెస్ శ్రేణుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యుత్ ఛార్జీల పెంపు ప్రజలకు పెనుభారంగా మారిందని, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉన్నమట్ల ఎలిజా మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే ప్రజలు రోజువారీ ఖర్చులతో ఇబ్బంది పడుతున్నారని, విద్యుత్ ఛార్జీల పెంపుతో వారి జీవితాలు మరింత కష్టతరమవుతున్నాయని అన్నారు. తక్షణం పెంచిన ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి సంజీవరెడ్డి, గౌతు సత్యేంద్ర బాబు, పిసిసి అధికార ప్రతినిధి ఎం.ప్రసాద్, నియోజకవర్గ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

తేమశాతం పేరుతో ధరలో కోత అన్యాయం

ప్రభుత్వం మారినా చినిగిన గోనెసంచులే

కాగితాల్లోనే సబ్సిడీ టార్పాలిన్లు

ఎపి రైతుసంఘం నేతల విమర్శ

చిరిగిన గోనెలు చూపుతున్న రైతులు, నేతలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మద్దతు ధరకే ప్రతి గింజా కొంటాం అని ప్రభుత్వం చెబుతున్న మాటలకు, ఆచరణకు పొంతన లేదని, దళారులు తేమ శాతం పేరుతో మద్దతు ధరలో రూ.325కుపైగా కోత పెట్టడం అన్యాయమని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. శుక్రవారం ఎపి రైతు సంఘం, ఎపి కౌలురైతుల సంఘం నాయకులు మండలంలోని ఉంగుటూరు, చేబ్రోలు, నారాయణపురం, నాచుగుంట, వెల్లమెల్లి గ్రామాల్లో పర్యటించి ధాన్యపు రాశులను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు సమస్యలను రైతులను, కౌలురైతులను అడిగి తెలుసుకున్నారు. చినిగిన గోనె సంచులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం ప్రయివేటు వ్యాపారులకైనా అమ్ముకోవచ్చని ప్రభుత్వమే చెప్పడంతో మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకుని అన్నదాతలు నష్టపోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మిషన్ కోత ద్వారా కోసిన ధాన్యంలో తేమశాతం ఎక్కువ ఉందనే పేరుతో మద్దతు ధర కంటే రూ.325కుపైగా కోత పెట్టడం తగదన్నారు. 75 కేజీల బస్తా ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.1725 కాగా దళారులు రూ.1380 నుండి రూ.1400కే కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. అయితే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సొమ్ము చెల్లించిన తర్వాతే రైతులకు సొమ్ము చెల్లిస్తామని చెప్పడం వల్ల మళ్లీ కొనుగోలు కేంద్రాలు దళారులమయం కానున్నాయని చెప్పారు. కల్లాల నుండి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలని, తేమ శాతం నిబంధన సడలించి ధాన్యాన్ని కొనాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో వలె చినిగిన గోనె సంచులే ఇస్తున్నారని విమర్శించారు. చినిగిన గోనె సంచులతో రైతులు నష్టపోతున్నారని ముఖ్యమంత్రి స్వయంగా ఆవేదన వ్యక్తం చేసినా నాణ్యమైన గోనె సంచులు ఎందుకు సరఫరా చేయలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కొత్త గోనెసంచులు సరఫరా చేయాలని కోరారు. ధాన్యం కొనుగోలు సమస్యలను పరిష్కరించి, అన్నదాతలకు మద్దతు ధర అందే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సీనియర్ నేత గుత్తికొండ వెంకటకృష్ణారావు, కౌలు రైతుసంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, కోకన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ పెరిగిన పెట్టుబడుల రీత్యా కనీస మద్దతు ధర రైతులకు, కౌలు రైతులకు గిట్టుబాటు కాదని, రాష్ట్ర ప్రభుత్వం ధాన్యానికి బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వై.సర్వారాయుడు, కె.సూర్యనారాయణ, పి.నాగభూషణం, పి.శివరామకృష్ణ, పలువురు రైతులు, కౌలురైతులు పాల్గొన్నారు

ఏజెన్సీలో ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలి
పోలవరం ఎంఎల్‌ఎకు వినతి



వినతి అందిస్తున్న ఆదివాసీ నేతలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని, ఆదివాసీ నిరుద్యోగులకు నూరుశాతం ఉద్యోగ రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుకు వినతిపత్రం అందజేసింది. కమిటీ నేతలు శుక్రవారం మండలంలోని బర్రింకలపాడులో ఎంఎల్‌ఎ నివాసం వద్ద వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మెగా డిఎస్‌సిలో ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. ఐదో షెడ్యూల్ ఏరియాలో నూరుశాతం రిజర్వేషన్లు అమలుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో నూరుశాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పిస్తున్న జిఒ నెం.3పై సుప్రీంకోర్టు తీర్పునకు ప్రత్యామ్నాయంగా ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకు ఉద్యోగ రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. గిరిజన గురుకులం విద్యా సంస్థల్లోని ఖాళీ పోస్టులను నోటిఫికేషన్లో పేర్కొన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే ఏ ఉత్తర్వులైనా 5వ షెడ్యూల్ క్లాజ్ (1)ఐ2) ప్రకారం గవర్నర్, గిరిజన సలహా మండలి (టిఎసి) ఆమోదం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. గిరిజన భాష రాని ఉపాధ్యాయులను ఏజెన్సీలో నియమించడం సరికాదన్నారు. ప్రస్తుతం నాన్ షెడ్యూల్ పంచాయతీ కార్యదర్శులను కూడా ఏజెన్సీ ప్రాంతంలో నియమించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డిఎస్‌సి నోటిఫికేషన్‌పై పున:పరిశీలించి ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ నిరుద్యోగులకు భద్రతా, భరోసా కల్పించాలన్నారు. ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రత్యేక గిరిజన డిఎస్‌సి ప్రకటనకు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, ఆదివాసీ యువతకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ బృందంలో ఆదివాసీ నిరుద్యోగ ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు తెల్లం రామకృష్ణ, కారం ధారయ్య, సరియం రామ్మోహన్, సోయం చంద్రరావు, ధర్మాల రమేష్, తెల్లం దుర్గారావు, పోలోజు నాగేశ్వరరావు, కారం భాస్కర్, బన్నె వినోద్, కట్టం నాగేశ్వరరావు, మడివి దుర్గారావు, కుంజా నవీన్, బంధం అర్జున్, కె.కిరణ్, ఇ.భూషణం, టి.బాబురావు, కె.దావీదు, కట్టం ముత్యాలరావు పాల్గొన్నారు.

11న జెడ్‌పి ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశం ఈ నెల 11వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు ఏలూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సభ్యులు, సంబంధిత అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని విఒఎల ధర్నాలు

ప్రజాశక్తి - నిడమర్రు

కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ విఒఎలు శుక్రవారం ధర్నా నిర్వహించి ఎపిఎం రత్నకుమార్‌కు వినతిపత్రం అందించారు. డి.విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ విఒఎలపై రాజకీయ వేధింపులు తగవన్నారు. అక్రమంగా తొలగించిన విఒఎలను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని, బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రదర్శనగా వెళ్లి తహశీల్దార్ నాగరాజుకు, ఎంపిడిఒ విజయకుమారికి వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.వరలక్ష్మి, జి.పద్మావతి, స్వరూప, రాధ, జి.మల్లేశ్వరి, రాజ్యలక్ష్మి, కమల, పుష్ప పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: విఒఎలు ప్రజా సంఘాల కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం డిటి సందీప్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వెలుగు ఎపిఎం జాన్సీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కొండలరావు మాట్లాడగా విఒఎల నాయకులు రమణ, పి.వీరలక్ష్మి, ఫర్జానా, వై.వరలక్ష్మీ, రాజేశ్వరి, మంగ, కుమారి, సత్యవతి పాల్గొన్నారు.

కుక్కునూరు: విఒఎల బకాయి వేతనాలు విడుదల చేయాలని సిఐటియు మండల కార్యదర్శి యర్రం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విఒఎలు తహశీల్దార్ కార్యాలయం వద్దకు ర్యాలీగా చేరుకుని ధర్నా చేపట్టారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కె.గ్రేసి, మేడవరపు రమాదేవి, కృపాజ్యోతి, కృష్ణవేణి, అమ్మాజీ, లక్ష్మీపార్వతి, అనురాధ, అలివేలు, లక్ష్మీకీర్తన, జ్యోతి, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్: విఒఎల సమస్యలు పరిష్కరించాలని ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు మడివి దుర్గారావు మాట్లాడారు. అనంతరం ఎంపిడిఒ శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బొగారి వెంకన్న, జి.వెంకటేశ్వర్లు, మెండెం స్వర్ణలత, వై.ఉష తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు - ఏలూరు రోడ్డు నిర్మించాలని రాస్తారోకో

ముసునూరు: నూజివీడు నుండి ముసునూరు మీదగా ఏలూరు వెళ్లే ప్రధాన రహదారి డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు అనుమతులు మంజూరై నాలుగున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ ఇప్పటికీ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంపై సిపిఐ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో సింహాద్రిపురం వద్ద శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల వందలాది మంది ప్రజలు ఈ రోడ్లో ప్రమాదాలకు గురై గాయపడటం జరిగిందని, వేల రూపాయలు వైద్యానికి ఖర్చు చేయాల్సి వచ్చిందని అన్నారు. గతంలో అధికార ప్రముఖులు ఈ కాంట్రాక్టు తీసుకుని రహదారిపై ఉన్న చెట్లను అమ్మివేసి సొమ్ము చేసుకున్నారని, రోడ్డు నిర్మాణం మాత్రం చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో నేతలు నిమ్మగడ్డ నరసింహా, నాగేంద్రరావు, కూచిపూడి నాగేశ్వరరావు, చెంగల వెంకటేశ్వరరావు, పిల్లి రాజారత్నం, మందలపు రమేష్, పామర్తి మధు, చలసాని బాలకృష్ణ, బొప్పూడి రాంబాబు, చెంగల లక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ సంచాలకు వారి ఆదేశానుసారం ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వారోత్సవాల్లో బాలల దినోత్సవం వేడుకలు, పుస్తక ప్రదర్శన, డ్రగ్స్‌పై అవగాహన, డాక్టర్ ఎస్‌ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం వంటి వారికి నివాళులర్పించడం, రచయిత సందేశం, విద్యార్థులకు వివిధ పోటీలు, మహిళా సాధికారతపై చర్చ, డిజిటల్ గ్రంథాలయాల వినియోగంపై ఓరియంటేషన్ వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆర్‌టిఐ-2005 చట్టాన్ని వినియోగించుకోండి

ప్రజాశక్తి - చింతలపూడి

ఆర్‌టిఐ-2005 అనేది ప్రతి పౌరుని హక్కు అని, ప్రతి పౌరుడూ తమకు కావాల్సిన సమాచారాన్ని సంబంధిత శాఖ, పౌర సమాచార అధికారికి అప్లికేషన్ చేసుకొని పొందవచ్చని ఏలూరు ఎపిఐ జి.శైలజ తెలిపారు. మండలంలోని శివపురంలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి సమాచార కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పౌరుడూ ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మేనకుమారి పాల్గొన్నారు.

నేడు జాతీయ న్యాయ సేవల దినోత్సవం

ప్రజాశక్తి - చింతలపూడి

సమాజంలోని పేద, బలహీన తరగతులకు ఉచిత న్యాయ సహాయం అందించడానికి లీగల్ సర్వీసెస్ అథారిటీస్ యాక్ట్ స్థాపించినట్లు చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు తెలిపారు. చింతలపూడి కోర్టు ఆవరణలో ఈ నెల తొమ్మిదో తేదీన జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా కోర్టు వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ చట్టం 1995లో అమల్లోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

'ముదినేపల్లిని కృష్ణా జిల్లాలో కలపాలి'

ప్రజాశక్తి - ముదినేపల్లి

గత వైసిపి ప్రభుత్వంలో కొత్త జిల్లాల విభజనలో భాగంగా ముదినేపల్లి మండలాన్ని ఏలూరు జిల్లాలో కలపడంతో మండల ప్రజలు జిల్లా కేంద్రమైన ఏలూరు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారని ముదినేపల్లి గ్రామానికి చెందిన వైద్య విద్యార్థిని, అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి పిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అంబుల వైష్ణవి శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. ముదినేపల్లి మండలం కృష్ణా జిల్లాలో కలిసి ఉన్నప్పుడు జిల్లా కేంద్రం మచిలీపట్నం వెళ్లేందుకు బస్సు సౌకర్యం అనుకూలంగా ఉండేదన్నారు. ఏలూరు జిల్లాలో కలపడంతో ముదినేపల్లి మండలాన్ని విభజన చేయడంతో జిల్లా కేంద్రం ఏలూరు వెళ్లేందుకు సరైన బస్సు సౌకర్యం లేదన్నారు. కృష్ణా డెల్టా శివారు ప్రాంతమైన ముదినేపల్లి మండలానికి పోలవరం, కృష్ణా కెనాల్, బిఎంటి కాలువల ద్వారా సాగు, తాగునీరు సకాలంలో అందేవన్నారు. ప్రస్తుతం కృష్ణా జిల్లా నుంచి పూర్తిస్థాయిలో తాగు, సాగునీరు అందడం లేదన్నారు. రబీలో అపరాల పంటలకు సాగునీరు అందక ఎండిపోయి రైతాంగం నష్టాల ఊబిలో ఉన్నారన్నారు. మండలంలోని 32 గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిగణనలోకి తీసుకుని తిరిగి కృష్ణా జిల్లాలో ముదినేపల్లి మండలాన్ని పునర్విభజించాలని సిఎం చంద్రబాబును విన్నవించినట్లు తెలిపారు.

'రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టాలి'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను రాష్ట్రపతి సుమోటోగా స్వీకరించి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టాలని కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ యాక్ట్ సెక్రటరీ గోళ్ల పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కూటమి పాలనలో భాగస్వామిగా ఉన్న పవన్‌కళ్యాణ్ రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి బాగాలేదని ప్రకటించిన విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ తమ ధ్యేయమని చెప్పారు. రాష్ట్రపతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనవైపు అడుగులు వేస్తే తాము స్వాగతిస్తామన్నారు.

పంటను దళారులకు అమ్మి మోసపోవద్దు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని గూటాల-1 రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ధాన్యం కొనుగోలు కేంద్రం మండల కమిటీ ఛైర్మన్, తహశీల్దార్ సాయిరాజు పాల్గొని మాట్లాడారు. రైతులు పండించిన పంట ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు విక్రయించుకోవాలని సూచించారు. ఇకవైపు పూర్తయిన రైతులు తమ ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి కె.రాంబాబు, విఆర్‌ఒ, రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా స్లీవజోజి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా జంగారెడ్డిగూడెం తహశీల్దార్ కె.స్లీవజోజిని నియమిస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులిచ్చారు. గతంలో ఇక్కడ ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న కార్యాలయ డిప్యూటీ తహశీల్దార్ సందీప్‌పై కలెక్టర్‌కు పలు ఫిర్యాదులు వెళ్లడంతో ఆయనను ఇన్‌ఛార్జి విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా స్లీవజోజి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - చింతలపూడి

సిఎం సహాయ నిధి పేదల పాలిట వరంగా మారిందని ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి ఎంఎల్‌ఎ కార్యాలయం వద్ద లింగపాలెం మండలం ఆసన్నగూడెం గ్రామానికి చెందిన ఏనుగు మేరి కుటుంబ సభ్యులకు శుక్రవారం రూ.97,016 చెక్కును అందించారు.

హాస్టళ్ల పరిశీలన

ఏలూరు సిటీ : స్థానిక అమీనాపేటలోని అంబేద్కర్ సైన్స్ పార్క్ వద్ద ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహాలను జనసేన నేత రెడ్డి అప్పలనాయుడు స్థానిక నాయకులు, వీర మహిళలతో కలిసి శుక్రవారం పరిశీలించారు. బిసి హాస్టల్‌లో ఉన్న బాలికలను ఆప్యాయంగా పలకరిస్తూ వారికి ఉన్న సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలికలు హాస్టల్‌లో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. హాస్టళ్లలో సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని రెడ్డి అప్పలనాయుడు చెప్పారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా స్థావరాలపై దాడి

ప్రజాశక్తి - చింతలపూడి

నాటుసారా స్థావరాలపై దాడి చేసిన ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు ముగ్గురిని అరెస్టు చేశారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ చింతలపూడి సిఐ పి.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పతంగులగూడెంలో విఆర్‌ఒ జల్లిపల్లి రజినితో కలిసి నాటుసారా స్థావరాలుపై శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు.

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని అజరయ్యపేటలో జరిపిన దాడుల్లో మహిళను అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అజరయ్యపేటలో చేసిన దాడిలో గ్రామానికి చెందిన మహిళ కాళహస్తి సుధను అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆమెపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

52 మద్యం సీసాలు స్వాధీనం

జీలుగుమిల్లి : అంకన్నగూడెం పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన ఒక వ్యక్తి వద్ద అక్రమంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన 40 మద్యం బాటిళ్లను గుర్తించినట్లు, అదే గ్రామానికి చెందిన మరొక వ్యక్తి ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన ఆంధ్రాకు చెందిన 12 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సిఐ కె.శ్రీను బాబు తెలిపారు. వేర్వేరు దాడుల్లో మొత్తం 52 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ప్రజలకు రెవెన్యూ సమస్యలుంటే సంప్రదించండి

కామవరపుకోట తహశీల్దార్ ఎలీషా

ప్రజాశక్తి - కామవరపుకోట

యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా పట్టుదల, ఏకాగ్రత, కృషితో బాగా చదువుకుంటే జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలకు చేరుకోవచ్చని తహశీల్దార్ జి.ఎలీషా అన్నారు. కొన్ని నెలల క్రితం సాధారణ బదిలీల్లో భాగంగా మండల తహశీల్దార్‌గా విధుల్లో చేరిన ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : గతంలో ఏయే ప్రాంతాల్లో తహశీల్దార్‌గా పని చేశారు?

తహశీల్దార్ : వేలేరుపాడు, జీలుగుమిల్లు తదితర మండలాల్లో పని చేశాను.

ప్రశ్న : దీపం-2 పథకం ద్వారా మండలంలో ఎంత మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలుగుతుంది?

తహశీల్దార్ : మండలంలో 18,397 మంది లబ్ధిదారులకు సవంత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు దీపం - 2 పథకం ద్వారా ఇవ్వనున్నట్లు తెలిపారు.

ప్రశ్న : బహిరంగా మార్కెట్‌లో బ్లాక్‌లో వంట గ్యాస్ సిలిండర్ల అమ్మకాలపై మీరేమంటారు?

తహశీల్దార్ : మండలంలో ఆ విధంగా అమ్మే వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. అటువంటి సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

ప్రశ్న : మండలంలో పట్టభద్రుల ఎంఎల్‌సి ఓటర్ల నమోదు ప్రక్రియ ఎలా జరుగుతుంది?

తహశీల్దార్ : ప్రస్తుతం మండలంలో 465 మంది ఓటర్లుగా నమోదు కావడానికి దరఖాస్తు చేసుకున్నారు. నవంబర్ ఆరో తేదీ లోపు మండలంలో అర్హత కలిగిన వారందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి.

ప్రశ్న : ప్రస్తుతం కొత్త రేషన్ కార్డు పొందటం ఎలా?

తహశీల్దార్ : కొత్త రేషన్ కార్డుల మంజూరు కోసం ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన అనంతరం అర్హత గల లబ్ధిదారులకు మంజూరు చేస్తాం.

ప్రశ్న : మండలంలో ఇటీవల నిర్వహించిన రీసర్వే గ్రామ సభల్లో ప్రజల నుంచి స్పందన ఏ విధంగా వచ్చింది?

తహశీల్దార్ : మండలంలో రీసర్వే పూర్తయిన ఎనిమిది గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించాం. రైతుల నుంచి 360 అభ్యంతరలకు దరఖాస్తులు స్వీకరించాం. వాటిపై నిబంధనల మేరకు విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : మండలంలో ప్రజలకు ఏమైనా చెప్పాలనుకుంటున్నారా?

తహశీల్దార్ : పౌర సేవలు చట్ట ప్రకారం, టైం లైన్, రూల్స్ ప్రకారం చర్యలు తీసుకుంటాం. మండలంలో రెవెన్యూ శాఖ నుంచి ప్రజలకు, రైతులకు ఏ విధమైన సమస్యలు, ఇబ్బందులు ఉంటే తహశీల్దార్ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రాత్రి పగలూ తేడా లేకుండా ప్రజలకు సేవలందిస్తున్న పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తామని, వారి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఏలూరులోని జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో సంక్షేమ దివాస్‌ను శుక్రవారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు పోలీసులు శాఖాపరమైన తమ సమస్యలపై ఎస్‌పికి వినతిపత్రాలు అందించారు. వాటిని పరిశీలించిన ఎస్‌పి వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

14 నుంచి ఇంటింటా సర్వే

ప్రజాశక్తి - దెందులూరు

పెదవేగి మండలంలోని పెదవేగి, విజయరాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జాతీయ కేన్సర్ డేను పురస్కరించుకుని ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు విజయరాయి, పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ మాధవి తెలిపారు. ఈ నెల 14వ తేదీన పెదవేగి మండలంలో కేన్సర్‌పై అవగాహన కల్పిస్తూ జరగనున్న సర్వేను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి తిరిగి కేన్సర్‌తో పాటు అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించనున్నట్లు వైద్యాధికారులు ప్రత్యూష, మాధవి సంయుక్తంగా తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అన్ని తరగతుల ప్రజలకు ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, పాఠశాలల ప్రయివేట్ కాన్వెంట్ విద్యార్థులకు, అంగన్వాడీ పిల్లలకు పూర్తి స్థాయి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు.

వయోజన విద్యపై శిక్షణ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

2030 నాటికి నూరుశాతం అక్షరాస్యత సాధించడమే ఉల్లాస్ అక్షరాస్యత(వయోజన విద్య) కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎంపిడిఒ బి.భార్గవి అన్నారు. వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ అక్షరాస్యత ఒక రోజు శిక్షణ కార్యక్రమం వెలుగు ఎపిఎం డి.రాజశేఖర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ భార్గవి మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక, డిజిటల్, క్రియాత్మక అక్షరాస్యతపై వంద రోజులు శిక్షణ ఇవ్వటంతో పాటు శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించి, సర్టిఫికేట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అక్షర వెలుగు మార్గదర్శిని ఆవిష్కరించారు.

ముసునూరు : వయోజన విద్య ద్వారా ప్రతిఒక్కరూ చదవడం, రాయడం నేర్చుకోవాలని వెలుగు ఎపిఎం కె.రాంబాబు అన్నారు. మండల కేంద్రమైన వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ అక్షరాస్యత (వయోజన విద్య) ప్రోగ్రాంపై మండల స్థాయి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం వెలుగు ఎపిఎం కోమటి రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2030 నాటికి వంద శాతం అక్షరాస్యత సాధించాలన్నారు. దీనిలో భాగంగా మహిళలకు ఆర్థిక, డిజిటల్, క్రియాత్మక అక్షరాస్యత ఈ వందరోజుల కార్యక్రమంలో నేర్పుతామని తెలిపారు. వందరోజుల శిక్షణ పూర్తయిన తర్వాత పరీక్షలు నిర్వహించి వారికి సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. వాలంటీర్ టీచర్స్‌కు కూడా జిల్లా కలెక్టర్ చేతులమీదుగా సర్టిఫికెట్లు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం వాలంటరీ టీచర్స్, లెర్నర్స్‌కు సంబంధించిన ట్రైనింగ్ మెటీరియల్ బుక్స్, అక్షర వెలుగు మార్గదర్శిని, అక్షర వెలుగు సంక్షిప్త వాచకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బుక్కుకీపర్లు, వాలంటరీ టీచర్లు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

చంద్రమ్మ కాలనీ గ్రామంలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు పూర్తిగా కాలిపోవడంతో సర్వం కోల్పోయిన కుటుంబాన్ని ఏలూరు జిల్లా ఆదివాసి మెడికల్ సిబ్బంది శుక్రవారం పరామర్శించి సహాయం అందించినట్లు తెలిపారు. మెడికల్ సిబ్బంది అధ్వర్యంలో ప్రస్తుతం వారికి కావాల్సిన బట్టలు, దుప్పట్లు, వంట సామగ్రి, నిత్యావసర వస్తువులను బాధిత కుటుంబానికి అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఉపాధ్యక్షులు ఎం.సువర్ణ, ఎస్.శ్రీరాములు, ఎంపిహెచ్‌ఎ ప్రసాద్, నాగమణి, నాగరత్నం, ఆదిలక్ష్మి, సుబ్బలక్ష్మి, స్వరాజ్యలక్ష్మి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి సిఐ బి.వెంకటేశ్వరావు, ఎస్‌ఐ నవీన్‌కుమార్ రూ.ఐదు వేల విలువైన బట్టలు, దుప్పట్లు, వంట సామగ్రి, నిత్యావసర వస్తువులను అందించారు.

పోష్ చట్టంపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో మహిళా ఉద్యోగులకు పోష్ యాక్ట్ 2013, సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపుల నిరోధం అంశంపై శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలపైన లైంగిక వేధింపులు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటిని అరికట్టడానికి అనేక చట్టాలు రూపొందించారని, ఈ చట్టాల్లో భాగంగా పోష్ యాక్ట్‌ను తీసుకొచ్చారని తెలిపారు. ఈ చట్ట ప్రకారం ప్రతి సంస్థలోని మహిళా ఉద్యోగుల రక్షణ కోసం కమిటీలు ఏర్పాటు చేయాలని, ఎవరినా వేధింపులకు గురైన సదరు కమిటీ ముందు ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు. ఆ కమిటీ సభ్యుల వివరాలను సంబంధిత కార్యాలయంలో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ జడ్జిలు వి.రఘునాథ్, టిఎవిఎస్ఎస్ఆర్.ఆదిత్య రిషిక్, ఎవి.నాగరాజు, కె.స్పందన, జెబిటిఎస్.దేవి, కుమారి, డి.అరుంధతి, ప్యానల్ లాయర్లు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రోగులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా పని చేస్తామని ఏలూరు సర్వజన ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ ఎంఎస్.రాజు అన్నారు. ఆయన శుక్రవారం ఆసుపత్రి పర్యవేక్షకులుగా బాధ్యతలు చేపట్టారు.

ఏలూరు అర్బన్ : ఏలూరు సర్వజన ఆసుపత్రి పర్యవేక్షకులుగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎంఎస్.రాజును రెడ్ క్రాస్ జిల్లా ఛైర్మన్ డివి.కృష్ణారెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ సర్వజన ఆసుపత్రికి అవసరమైన సహాయం అందించటానికి సంస్థ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సర్ సిఆర్.రెడ్డి అటానమస్ కళాశాలలో 2023-24 సంవత్సరానికి సంబంధించి పీజీ రెండు, నాలుగు సెమిస్టర్ పరీక్షా ఫలితాలు శుక్రవారం అటానమస్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కెఎస్.విష్ణుమోహన్, కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల పరీక్షా ఫలితాలు కళాశాల నోటీసు బోర్డులో ప్రదర్శించారు. వారి మార్కుల జాబితాలను సోమవారం నుంచి పీజీ కళాశాల ఆఫీసులో జారీ చేయనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కెఎ.రామరాజు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బివిఆర్‌డి ఫణికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.విశ్వేశ్వరరావు, పీజీ కోర్సుల డైరెక్టర్, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ విఆర్‌ఎస్.బాబు, కె.ఆనందరావు, కె.హేమలత, జిఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని నూజివీడు ఉప విద్యాశాఖాధికారి సేవియా తెలిపారు. గొల్లపల్లి శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆయన శుక్రవారం మోటివేషన్ క్లాస్ తీసుకున్నారు. పదో తరగతి విద్యార్థులను తెలుగు, ఇంగ్లీష, హిందీ, సైన్స్, లెక్కలు, సోషల్ సబ్జెక్టుల్లో పలు ప్రశ్నలు అడిగారు. నీతి కథను చెప్పారు. ఆరు, ఏడు, ఎనిమిది తరగతులకు జరుగుతున్న పరీక్షను పరిశీలించారు. ఏ రోజు ఇచ్చిన వర్కును ఆరోజే పూర్తి చేయాలని, పెండింగ్ ఉంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రాధికారాణి, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ వీరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిఆర్‌డి స్కూల్‌లో రేడియాలజీ దినోత్సవం

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరులోని బిఆర్‌డి స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో రేడియాలజీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూడో సంవత్సరం విద్యార్థిని సునీత, రెండో సంవత్సరం విద్యార్థి ఐశ్వర్య మాట్లాడుతూ ఆధునిక ఆరోగ్య సంరక్షణలో రోగ లక్షణాల సూచిక పాత్రను ప్రోత్సహించడానికి ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు.

సర్వే చేస్తున్న గురజ సచివాలయ సెక్రటరీ హారిక

ఇంటింటా జియో ట్యాగింగ్ సర్వే

ప్రజాశక్తి -ముదినేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటా జియో ట్యాగింగ్ సర్వే శుక్రవారం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సచివాలయ సిబ్బందితో ఈ సర్వే ఇంటింటా ప్రారంభమైంది. ఈ సర్వేలో హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వే అనేది మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రారంభమైంది. ఈ సర్వేలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి హౌస్‌ని క్యాప్చర్ చేసి ఇంట్లో ఉన్న వ్యక్తితో తంబ్ వేయించుకుంటారు. ప్రతి ఇంటికి సంబంధించిన సమగ్ర వివరాలు సేకరిస్తే, పథకాలు ఎవరు పొందుతున్నారు, ఇంకా వివిధ పథకాలు అర్హులకు ఇచ్చేందుకు అవకాశం ఉందని గ్రామపంచాయతీ అధికారులు చెబుతున్నారు.

టి.నరసాపురం : మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి 21 వేల గృహాలను జియో ట్యాగ్ చేస్తున్నట్లు ఎంపిడిఒ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. సచివాలయ సిబ్బంది ద్వారా ఈ సర్వే పనులు చేపట్టామన్నారు. మండలంలోని బ్యాంకు ఖాతాదారులు తమ బ్యాంకు ఖాతాలు నిలిచిపోయిన, ఆధార్ లింకు చేయించని 5,800 వేల మంది వెంటనే ఆయా బ్యాంకులను సంప్రదించాలన్నారు. అలాగే పాఠశాల రికార్డుల్లో విద్యార్థుల పేర్లు, పుట్టిన తేదీలు తప్పులు ఉన్న విద్యార్థులు ఆధార్లో ఉన్నట్లు సరిచేయించుకోవాలని తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో నూజివీడులోని మున్సిపాలిటీ కార్యాలయంలో పని చేస్తున్న మున్సిపాలిటీ కార్మికులకు బాలల హక్కుల పరిరక్షణపై అవగాహనా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ జె.ఆంజనేయులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న బాలలను పరిరక్షించుదామని, వారికి రక్షణగా ఉందామని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ కె.వెంకటరామిరెడ్డి మట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతగా బాలల హక్కుల పరిరక్షణ కోసం సహకారం అందించి అందమైన బాల్యాన్ని బాలలకు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నవజీవన్ బాల భవన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇళ్ల స్థలాల కోసం పోరాడాలి

ప్రజాశక్తి - కామవరపుకోట

ఇళ్ల స్థలాలైన, సాగుభూములైన పేదలకు దక్కాలంటే పోరాటాలే శరణ్యమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా జనరల్ బాడీ సమావేశం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన కామవరపుకోటలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల18వ తేదీన సిపిఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాల ఎదుట జరిగే పోరాటంలో పేదల్లో సెంటు స్థలం కలిగిన వారు రెండు సెంట్ల కోసం, ఒకటిన్నర సెంటు ఉన్నవారు మూడు సెంట్ల కోసం వ్యక్తిగత అర్జీలతో కలిసి రావాలని వారు కోరారు. ప్రభుత్వం స్పందించి పేదలకు భూములు పంచకపోతే ఎర్ర జెండా ఆధ్వర్యంలో భూ పోరాటాలు చేసి పేదలకు పంచుతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, పెదపాడు మండలం, కొత్తూరు గ్రామానికి చెందిన కన్నే జ్యోతి అను నేను ఏలూరు జిల్లా, కొత్తూరు గ్రామం నుండి కొత్త ముప్పరులో మా బంధువుల ఇంటికి మోటారు సైకిల్ పై వెళ్ళు చుండగా మార్గమధ్యలో పాస్‌పోర్టు నెం. **H9066198 పడిపోయినది.** నేను బంధువుల ఇంటికి వెళ్లిన తరువాత చూసుకుంటే నా ఒరిజినల్ పాస్‌పోర్టు కనిపించలేదు. మార్గమధ్యలో వెతికి చూసినా కనిపించలేదు. దొరికిన వారు ఈ క్రింది చిరునామాకి తెలియజేయగలరు.

కన్నే జ్యోతి
డో.నెం.1-3, అంబేద్కర్ బొమ్మ దగ్గర, కొత్తూరు, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా. సెల్: 9618443023

ప్రకటన

నా క్లయింటు పొట్లూరి శ్రీనివాస సత్య కుమార్ అను వారికి ఏలూరు జిల్లా, పెదపాడు మండలం, కలపర్రు గ్రామ పంచాయితీలో చేరిన గోగులపాడు గ్రామంలోని **ఆర్.ఎస్.నెం.211,213/2**ర్లు దాఖలా చ.గ.200.22ల స్థలమునకు చెందిన క్రయ దస్తావేజు నెం.12297/2017 రుగా సంక్రమించినది. సదరు దస్తావేజును తీసుకుని ఏలూరు పెద్ద పోస్టాఫీసు సమీపంలోని జిరాక్స్ షాపులో జిరాక్స్ తీసుకుని వెళ్తుండగా **ది.5-11-2024వ** తేదీన మార్గమధ్యలో సదరు దస్తావేజు పోయినది. ఎంత వెతికినా దొరకలేదు. సదరు దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల నాకు గానీ నా క్లయంటుకు గాని అప్పగించగలరు.

ఏలూరు — కె.వి.పి.మాధవరావు
తేది.8-11-2024 — అడ్వకేట్, నోటరీ
సెల్ : 9440111033

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No: 46/2020
చెన్నుపాటి కామాక్షమ్మ .... మరికొందరు వాదులు
V/s
పాలేరు శ్రీరామకృష్ణ మరికొందరు...... ప్రతివాదులు
To
D5) రామినేని వాణిశ్రీ W/o వెంకటేశ్వరరావు, అల్లూరి సీతారామరాజు మెడికల్ కాలేజి, ఏలూరు పట్టణం, వెస్ట్ గోదావరి జిల్లా.

పై నంబరు దావాని వాది డిక్లరేషన్ మరియు స్వాధీనము చేయమని కోరుచూ దావా దాఖలా చేసి మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీరు తేది 26-11-2024 న ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటల లోపు పై కోర్టు వారు ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనేది. లేనిచో దావాని నీ పరోక్షముగా తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో//
మోతుకూరి సుభాష్ బాబు
మురకొండ చంద్రశేఖర్
అడ్వకేట్స్, అద్దంకి.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి :: ఏలూరు
F.D.I.A.No.1945/2008, O.S.No.7/1993
బిట్వీన్:
కొసరాజు వీరవెంకట వరప్రసాద్ **...పిటీషనరు /వాది**
మరియు
కొసరాజు వెంకట నారాయణ (డైడ్) వగైరాలు **...రెస్పాండెంట్స్**
పిటీషనరు /వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల ఫైనల్ డిక్రీ పిటీషనులో 9వ రెస్పాండెంటు అయిన మందలపు హరిత, తండ్రి: కొసరాజు పెదసుబ్బయ్య, ఫ్లాట్ నెం.20, స్రేయ అపార్ట్‌మెంట్, కె.కె.టవర్స్, సత్రంపాడు, ఏలూరు, ఏలూరు జిల్లా అను వారికి **ది.20-11-2024వ తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టులో స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయ్యి తమ ఆక్షేపణలు తెలియ పర్చుకొనవచ్చును.** లేని ఎడల సదరు పిటీషను తమ పరోక్షమందు విచారించి తీర్మానం చేయుదురని ఇందు మూలముగా తెలియచేయడమైనది.

ఆవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
ఏలూరు, — అడ్వకేట్స్, అశోక నగర్,
08-11-24. — ఏలూరు, ఏలూరు జిల్లా.

In The Court Of The Prl. District Judge, Eluru
F.D.P.No.561/2024, O.S.No.66/2022
Between:
Kuppala Satyavathi ***...Petitioner /Plaintiff***
AND
Kuppala Chiranjeevi and Others ***...Respondents /Defendants***
TO: R-2:
Kuppala Tejo Muurthy, S/o. Late Kupa Pentiah, Hindu, Male, Aged about 39 Years, Tapi Mastry, R/o. D.No.28-3-10A, Piranngula dibba, Eluru, W.G.Dist, Eluru JCJC.

కోర్టు ప్రకటన

పై నెంబరు గల ఎఫ్.డి.పి.నెం. 561/2024లో 2వ రెస్పాండెంటు గారికి ఎన్నిసార్లు కోర్టు నోటీసులు పంపిననూ పుచ్చుకోకుండా కాలయాపన చేయు చున్నందున శ్రీ కోర్టు వారు నోటీసులు అమలు నిమిత్తం 2వ రెస్పాండెంటు కు ఆర్డరు వేసినారు. కావున పై వారికి ఏమయినా ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు ఎదుట **ది.20-11-2024వ తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమున తీర్పు చెప్పబడును.**

NEKKARAGANTI NARASIMHA RAO
Eluru, — Advocate, Eluru
01-11-2024 — Cell: 9848118984

IN THE COURT OF THE FIRST ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) TANUKU
I.A.329/2023 & I.A.539/2020 in O.S.640/2020 and O.S.640/2020
Between:
Padala Satyanarayana Reddy **...Petitioner & Plaintiff**
And
Mudundi Subbalakshmi & Others **...Defendants & Respondents**
D3: Chiluvuri Manideepika, W/o.Seeta Rama Raju, R/o.Oduru (Penumantra Mandalam).

వాది మరియు పిటీషనర్ తరపున వేయించిన ప్రకటన

ఇందుమూలముగా 3వ ప్రతివాది / రెస్పాండెంట్‌కు పైనంబరు గ్రంథములో కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టు వారు నోటీసు పేపరు ప్రకటన ద్వారా ఆర్డరు వేసియున్నారు. కావున మీరు **ది.22-11-2024వ** తేదీన ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, లాయరు ద్వారా గానీ హాజరు అయి అభ్యంతరములు తెలుపు కొనవలెను. లేనియెడల మీ పరోక్షములో దావా మరియు పిటీషన్‌లు విచారణ చేసి తీర్మాణం చేయబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు
గుడిమెట్ల వీర్రెడ్డి
తణుకు — వాది తరపు న్యాయవాది
ది.04-11-2024 — సెల్: 9440607793

ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.37/2016
బిట్వీన్:
చిటికిన సూర్యచంద్రరావు (డైడ్)
చిటికిన పార్వతి అండ్ అదర్స్ **...వాదులు**
మరియు
వేముల కృష్ణ మూర్తి అండ్ అదర్స్ **...ప్రతివాదులు**
టు: శ్రీమతి అంగర వనరాజ్యలక్ష్మి, భర్త: గోవిందు, C/o.తండ్రి: చిటికిన పార్వతి, డో.నెం.8-104/2, గౌడపేట, మోర్త గ్రామం, ఉండ్రాజవరం మండలం, తణుకు పి.జె.సి.జె.

పై నెంబరు గ్రంథములో మీకు శ్రీ కోర్టు ద్వారా ఎన్నిపర్యాయములు (నోటీసులు) సమన్లు పంపి యున్నప్పటికీ మీరు తీసుకోవటం లేదు అని శ్రీ పై కోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా ది.12-11-2024న ఉదయం గం॥10:30 ని॥లకు హాజరు కమ్మని ఆర్డరు వేసియున్నారు. మీరు **ది.12-11-2024న ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేక ప్లీడరు ద్వారా కాని హాజరు అయ్యి ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలియపర్చుకొనవలెను.** లేని ఎడల మీ పై పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్పుచెప్పబడును.

P.PADMAVATHI
B.SRINIVASA PRASAD
Advocates,
Tadepalligudem, — Tadepalligudem,
01-11-2024. — Pentapadu.

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.A.No.76/2019 in O.S.No.322/1996
ఆకెళ్ళ అగ్ని హోత్రుడు (డైడ్) వగైరా ...Petitioner/Dhrs
Petitioner/Dhrs 2 to 5 being represented by regd. G.P.A. Medapati Gangadhara Subrahmanyeswara Reddy)
మరియు
పాలపర్తి సరోజినీ డైడ్ వగైరా ...Respondents/Jdrs
To.
1.పాలపర్తి విజయశేఖర్, S/o.లేటు భాస్కరరావు, డోరునెంబర్.8-25, చినపేట లంకలకోడేరు, పాలకొల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. పిన్:534250. Respondent No.3
2.పిల్లి ఎస్తేరు విజయకుమారి, భర్త విజయకుమార్, 129 MP, ఎలిమెంటరి స్కూల్ దగ్గర, RVM Buildings Housing Colony, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా.534201. Respondent No.4
3.ఇసుకపట్ల రాజ్యలక్ష్మి, భర్త కిశోరు, 166 అంగన్‌వాడీ సెంటర్ దగ్గర, తాడి వీధి, పోలీస్ క్వార్టర్స్ దగ్గర, ఇసకతోట, విశాఖపట్నం జిల్లా - 530022 Respondent No.5

మీ పై, పై పిటీషనరు పై కోర్టులో పై దావా ఆస్తిని బహిరంగ వేలము వేయించుట మూలముగా దావా డిక్రీ బాకీ వసూలు చేయు నిమిత్తం మీ పై పై నెంబరు పిటీషన్ దాఖలు చేసినందున సదరు దావాలో 3,4 మరియు 5వ Respondents/JDrs అయిన మీకు పలుమార్లు కోర్టు ద్వారా నోటీసులు పంపించినను, ఉద్దేశ్య పూర్వకంగా త్రిప్పిపంపించి వేసినందున శ్రీపైకోర్టు వారు పై Respondents అయిన మీ యొక్క హాజరు నిమిత్తం పత్రికలో ప్రకటన చేయవలసినదిగా ఆర్డర్ జారీ చేసినారు. సదరు ఆర్డరు ప్రకారం సదరు పిటిషను ది.**28-11-2024** తేదికి వాయిదా అయి వున్నది. కాబట్టి మీరు స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట ఉదయం 10.00 గంటల నుండి హాజరై ఆక్షేపణలు తెలియచేసుకొన వలెను. లేనియడల మీ పరోక్షమున పై పైపిటిషను తీర్మానం చేయబడును.

//Order of Court//
నర్సాపురం — **రామారావు పొన్నమండ**
తేది.08-11-2024 — అడ్వకేట్, నర్సాపురం.